# పబ్లిక్ ప్రాపర్టీ

A

**అడల్ట్స్ ఓన్లీ కథ!**

**కర్లపూడి విజయలక్ష్మి**



గంట ఆలస్యంగానైనా ఆఫీసుకి చేరుకోవాలని ఫస్ట్ బస్సెక్కాను. వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. సమ్మర్ హాలిడేస్ ఇంకా ఉండడం వల్ల పిల్లలిద్దరూ అక్కడే ఉండిపోయారు.

నేను ప్రయాణం కాగానే అమ్మ, నాన్న, చెల్లి, తమ్ముడు అంతా కళ్ల నీళ్ళు పెట్టుకున్నారు. అప్పటివరకూ గుండెల్లోనే సుడులు తిరుగుతున్న దుఃఖం కన్నీటి రూపంలో బయటికొచ్చింది. అమ్మని కావలించుకుని ఒక్కసారిగా భోరున ఏడ్చాను.

బస్సు లోపల జనం తక్కువగానే ఉన్నారు. డ్రయివర్ లేదు కండక్టర్ ఉన్నాడు.

''అమ్మా! విజయవాడ వరకూ వచ్చి నిన్ను బస్సెక్కిస్తాను'' అన్నారు నాన్న.

''వద్దులే నాన్నా. విజయవాడ ఎంత దూరం? నేను బస్సు మారి వెళ్ళగలనులే'' చెప్పాను.

ఆ మాటలంటున్నప్పుడు నాన్న గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. నాదీ అదే పరిస్థితి.

'నా బ్రతుకంతా ఒంటరి ప్రయాణమేనా నాన్నా' మనసు మూగగా రోదించింది.

ఎప్పుడూ ఆయన వెనుక తలొంచుకుని వెళ్లడమే తప్ప ప్రక్కనున్న పరిసరాలను కూడా పట్టించుకునేదాన్నికాదు. ఇల్లే నా ప్రపంచం. బయటి ప్రపంచాన్ని నేనెప్పుడూ పరిశీలనగా చూడలేదు. నాకు ఆ అవసరం కూడా లేదనిపించింది. టెన్త్ వరకూ చదివేనే కానీ స్కూలికి తప్ప మరోచోటుకి దారితెలీదు.

నా కోసం సినిమాలు చూడ్డం మానేశారు. అడిగితే చిన్న చిన్న త్యాగాలు... అడ్జస్ట్‌మెంట్స్ దాంపత్యాన్ని స్వర్గతుల్యం చేస్తాయనేవారు.

నన్ను ఆయనలో కలిపేసుకుని...నా ఉనికే లేకుండా బ్రతికా పదిహేను సంవత్సరాలు. పదిహేనురోజుల్లా ఇట్టే గడిచిపోయాయి. నా ప్రశాంత జీవితంలో అలజడి, అశాంతి సృష్టిస్తూ, పదిహేనేళ్ల నా జీవితంలో స్థిరపడిన వసంతాన్ని నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా తరిమికొట్టి హఠాత్తుగా శిశిరం ప్రవేశించింది. జీవితంలో వెన్నెల చెదిరిపోయి...అమావాస్య చీకట్లు కమ్ముకున్నాయి. పిల్లల కోసం ఒంటరి

ప్రయాణాన్ని కొనసాగించడానికే నిర్ణయించుకుని ఆయన ఉద్యోగంలో అయిష్టంగానే జాయిన్ అయ్యాను. కొత్త మనుషులు, కొత్త పరిచయాలు, ఆ కొత్త ప్రపంచంలో ఊపిరాడనట్టయ్యింది. అయినా తప్పదు.

''పర్లేదు నాన్నా! ఈ ఏడాదిగా సిటీ బస్సుల్లో ఒంటరి ప్రయాణం బాగానే అలవాటయ్యింది''ఆలోచనలనుండి బయటపడి నన్ను నేను ఓదార్చుకుని, నాన్నని ఓదార్చాను. డ్రయివర్ వచ్చాడు.

''జాగ్రత్తగా వెళ్ళమ్మా. వెళ్లగానే ఫోన్ చెయ్యి'' అయిష్టంగానే నాన్న వెనుతిరిగారు.

బస్సు కదిలింది. కండక్టర్ టిక్కెట్లిస్తున్నాడు. ''టిక్కెట్‌కి సరిపడ చిల్లర తెచ్చుకోవాలని తెలీదా? పొద్దున్నే యాభైకి చిల్లర ఎక్కడ్నించి వస్తుంది?'' వెనుక సీట్లలోని ప్రయాణికుల మీద మండిపడ్డాడు కండక్టర్.

నా గుండె గుభిల్లుమంది. ''నా దగ్గర వందనోటుంది. భయపడుతూ చెప్పాను. విజయవాడకి ఒకటి. చిల్లరలేదని''

''పర్లేదు. టిక్కెట్ వెనుక రాశాను. దిగే ముందిస్తాను'' చిరునవ్వుతో చెప్పాడు.

హమ్మయ్య చిల్లర లేదంటూ గట్టిగా అరవనందుకు సంతోషపడ్డాను.

ఏదో అనీజీగా అన్పించి తలపక్కకి తిప్పిచూశాను. చూపులు బాణాల్లా గుచ్చుకుంటున్నాయి. కండక్టర్ రెప్పవాల్చకుండా నన్నే అదోలా చూస్తున్నాడు. ఇబ్బందిగా కదిలి తల పక్కకి తిప్పుకున్నాను.

ఏదో స్టేజ్‌లో ఇద్దరు మగాళ్లెక్కారు. మరి కొద్దిసేపటికి తలతిప్పిన నాకు అతను అదే పొజిషన్లో కన్పించాడు. అసలు జన్మలో ఆడదాని మొహమే చూడనంత ఆబగా చూస్తున్నాడు. ఆకలిగొన్న మృగంలా చూస్తున్నాడు. ఆ బెడ్‌లైట్ వెలుగులోనే కళ్ళు చిట్లించుకుని చూపులతోనే వొళ్ళంతా తడిమేస్తున్నాడు. అసహ్యం కలిగింది. ముఖం చిట్లించుకుని ప్రక్కకి తిప్పుకోబోయాను.

''మీకు చిల్లర ఇవ్వాలిగా ఎంత?'' సీట్ చివరికంటా జరిగి చిరునవ్వుతో అడిగాడు. నేను చేయి ముందుకి చాపి టిక్కెట్ చూపించాను.

ఇలా ఇవ్వండంటూ వేళ్ళని తాకిస్తూ టిక్కెట్ తీసుకున్నాడు. చేయి గభాల్న వెనక్కి లాక్కున్నాను. టిక్కెట్ వెనుక చూసి టిక్కెట్, డబ్బు కలిపి చేయిసాచాడు. నా చేయి జంకుగా ముందుకెళ్ళింది. అనుకున్నంత అయ్యింది. నా అరచేతిలో తన గుప్పిట వుంచి అరచేయి పూర్తిగా తాకిస్తూ గుప్పిట విడిచాడు. బాగా ఒళ్ళు మండింది. కానీ ఏమీ అనలేని నిస్సహాయత.

''మీరు ఉద్యోగం చేస్తున్నారా? ఏ డిపార్ట్‌మెంట్? ఏ ఊర్లో చేస్తున్నారు?'' వివరాలు అడగడం మొదలుపెట్టాడు.

''చీరాల!'' ఎందుకో నాకు తెలియకుండానే అబద్ధం చెప్పాను.

నాన్న, నేను మాట్లాడుకోవడం అంతా విన్నాడని అర్థమైంది.

దానికితోడు నా రూపమే నా పరిస్థితిని చెబుతోంది. కళావిహీనంగా ఉన్న నుదురు. నల్లపూసలు లేక బోసిపోయిన మెడ...బాధగా నిట్టూర్చాను.

టిక్కెట్స్ తీసుకున్నది మొదలు పాసింజర్స్ అంతా నిద్రకొరిగారేమో కండక్టర్ వాడి చూపులు ఏ జంకూలేకుండా నా వంటిమీద యథేచ్ఛగా పారాడుతున్నాయి. పైట చెంగు భుజం చుట్టూ కప్పుకుని, సొంతం ప్రక్కకి తిరిగి విండోలోంచి బయటికి చూడడం మొదలుపెట్టాను.

వాడి ఆకలి చూపులకి నా స్థితి ఒక కారణమైతే ముప్పై రెండేళ్లయినా పెళ్ళి కాని టీనేజర్‌గా కన్పించే స్ట్రక్చర్ మరో కారణం.

జూనియర్ ఇంటర్ చదివే కూతురుందంటే ఎవరూ నమ్మరు మరి.

వేసవి అవ్వడం వల్ల ఆరుగంటలకే బాగా తెల్లారినట్టుంది. బస్సు దిగి పాడు పీడ విరగడైందనుకుని చీరాల బస్సులు ఆగే చోటుకి వచ్చాను. బస్సుకి ఇంకా అరగంట టైముంది. వెయిట్ చేస్తూ కూర్చున్నాను.

ఓ పదినిముషాలు గడిచాయి. ''మీ బస్సింకా రాలేదా?'' ఆ మాటలకి ఉలిక్కిపడి తలతిప్పి చూశాను. నవ్వుతూ నా వైపు చూస్తున్నాడు ఆ కండక్టర్.

గుండె గుభేలుమంది. ఆ బస్సు దిగినా కూడా వెధవ నన్నింకా వదిలేలా లేడేంటి? నన్ను వెదుక్కుంటూ వచ్చాడు. భయంతో శరీరం సన్నగా వణకసాగింది. నా భయం, ఆందోళన బయటికి కన్పించకుండా చేయడానికి విశ్వప్రయత్నం మొదలెట్టాను. ఎవరిగొడవలో, ఎవరి హడావిడిలో వారున్నారు. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.

తనే బస్సు టైమింగ్స్ చూసి-

''ఓ ఇంకా ఇరవై నిముషాలుంది. ఈలోపు క్యాంటీన్‌లో కాఫీ త్రాగుదాం రండి'' చాలా కాజువల్‌గా అడిగాడు.

నిర్ఘాంతపోయాను. ముక్కూ మొహం తెలీనిదాన్ని. తన బస్సులో కలిసి గంట ప్రయాణం చేసినంత మాత్రాన, ఆ కాస్త పరిచయానికే కాఫీకి ఇన్వైట్ చేయడం అసహజంగానూ, ఎంబ్రాసింగ్‌గానూ ఉంది.

ఎదురుచూడని...ఎంత మాత్రమూ ఊహిం



చని ఆహ్వానం. మొదటుషాకైనా తప్పించుకోవడానికి మార్గాన్ని అన్వేషిస్తూనే ఉన్నాను.

''సారీ! నాకు బస్‌కి టైమయ్యింది'' చాలా పొలైట్‌గా చెప్పాను.

''ఆ టైంకి మనం టిఫిన్ చేసి రావచ్చు. అయినా చీరాలకి అరగంటలో బస్సుంది. మీరు కంగారుపడాల్సిన పనిలేదు ప్లీజ్''

ఎన్నో ఏళ్ళ పరిచయస్తుడిలా తేలిగ్గా నవ్వేస్తూ నన్ను కన్విన్స్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

నాతో ఇంకాస్త ఎక్కువ సమయం స్పెండ్ చేయాలన్న అతని తాపత్రయానికి నవ్వొచ్చింది.

ఎవరికివారే తమ భార్య మాత్రం పరాయి మగాడిని కన్నెత్తి చూడని పతివ్రతగా వుండాలని, ఎదుటివారి భార్య మాత్రం తమకి అందుబాటులో ఉండాలనుకునే చాలామంది మగాళ్ళ లాంటి వాడే ఈ కండక్టర్ కూడా.

తన భార్య మడిలో మగ్గిపోతే తను మాత్రం ఎదుటివాడి పెళ్ళాం కౌగిట్లో కరిగిపోవాలనే నీచమైన నైజం మగాళ్ళది. ఈ సంవత్సర కాలంలో ఇలాంటి అనుభవాలెన్నో..పరాయి ఆడదానికిచ్చే ప్రాధాన్యత మగాడు మరిదేనికి ఇవ్వడేమో. ఛీ..ఛీ మగజాతి మీదే అసహ్యం కలిగింది.

నా ఆలోచనా సమయాన్ని ఆసరా చేసుకుని తనకనువుగా మార్చుకుని చనువుగా బ్యాగ్ చేతిలోకి తీసుకుని ''రండి'' అన్నాడు.

''మీ సరదా నేనెందుకు కాదనాలి?'' వస్తున్న కోపానికి, అసహ్యానికి నవ్వు పులుముతూ అన్నాను.

నా నవ్వు ముఖం చూడగానే అతని ముఖం ఆనందంతో వెలిగిపోయింది. నీ మీద గెలుపు నాదే అన్నంత గర్వంతో కళ్ళు మిలమిలమెరిసాయి.

ఇద్దరం క్యాంటీన్‌కి వెళుతుంటే ఎదురొచ్చిన ఓ కండక్టర్ ''మీ వైఫా?'' నాకేసి పరిశీలనగా చూస్తూ అడిగాడు.

''మా మరదలు''అతను తమాషాగా కళ్ళార్పడం నా దృష్టిని దాటిపోలేదు.

వరుసలు కలిపే వాడి తీరుచూస్తే వొళ్ళు మండిపోయింది.

తల్లి...చెల్లి.. పెళ్ళాం...కూతురు తప్ప మగాళ్ళకందరికీ మిగిలిన ఆడాళ్ళంతా మరదళ్ళేనేమో. గుణం తక్కువ వెధవలు. ఆడదాన్ని చూడగానే చీప్‌గా అంచనా వేసే మగాళ్లని షూట్ చేసే అధికారముంటే ఎంత బావుండు.

టోకెన్లు తీసుకొచ్చాడు. టిఫిన్ తిన్నాం. కాఫీ త్రాగుతుండగా

''నా ఫ్రెండ్ ఇల్లు ఇక్కడికి దగ్గరే....వాడి భార్య ఊరెళ్లింది. మనం అక్కడికి వెళదాం'' టిఫిన్ చేద్దాం రండి అన్నంత క్యాజువల్‌గా అన్నాడు.

మరో స్టెప్ తీసుకున్నాడు. నాకు టిఫిన్ ఇప్పించి దానికి ప్రతిఫలం కోరుకుంటున్నాడు. ఇది నేను ముందే ఊహించాను కనుక షాక్ అవ్వలేదు, ఆశ్చర్యపడలేదు. కోపం తన్నుకుంటూ రాలేదు. కూల్‌గా ఆలోచించడం మొదలెట్టాను.

''ఎందుకూ?'' ఏమీ అర్థం కాని దానిలా మొహం అమాయకంగా అడిగాను.

''ఏమీలేదు. కాసేపు సరదాగా మాట్లాడుకుందామని'' అతని మాటల్లో తడబాటు.

అతన్ని వదలించుకోవాలి. బస్‌కి టైం అవుతోంది. ''అరె! సేమ్ ఫీలింగ్. తమాషాగా ఉంది కదూ!'' నా పెదవుల మీద చిరునవ్వు చెదరలేదు.

'తమాషా కాదూ..చిత్రం అంతకన్నా కాదూ..మొదట పతివ్రతల్లా పెద్ద ఫోజు కొడతారు. కాస్త దువ్వితేచాలు వగలుపోతూ వళ్ళోకొచ్చి వాలతారు...నీలాంటి ఆడవాళ్ళని చాలా మందిని చూశాను' అన్నట్లు విచిత్రమైన ఓ చూపు విసిరాడు.

''అయితే ఇంకా ఆలస్యమెందుకు?'' మెరుస్తున్న కళ్లతో ఉత్సాహంగా అన్నాడు.

''కా..నీ...''


''ఏవిటో చెప్పండి'' నా 'కానీ'కి అర్థం అర్థం కాక అడిగాడు.

''ఈరోజు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫీస్‌లో ఉండాలి. ఇన్‌స్పెక్షన్ ఉంది. అందుకే ఫస్ట్ బస్సుకి బయలుదేరాను'' మొహంలో చెప్పలేనంత దిగులు కూడబెట్టుకుని... అతని ఫీలింగ్స్ పరిశీలిస్తూ చెప్పాను.

''ఓ గంట పర్మిషన్ తీసుకోవచ్చు'' నా దిగులు కనిపెట్టినవాడిలా సలహా ఇచ్చాడు.

''అరె..ఏవిటి ఇన్‌స్పెక్షన్ టైంలో పర్మిషన్స్. లీవ్స్ అంగీకరించరని మీకు తెలుసుకదా! లేకుంటే ఈ పూటంతా మీ కంపెనీని ఎంజాయ్ చేసేదాన్ని...ప్చ్...నాకా ప్రాప్తం ఉన్నట్టు లేదు'' అదే దిగులు కంటిన్యూ చేస్తూ అన్నాడు.

''అయితే వెళ్ళిపోతారా?'' అదోలాంటి నిరాశ అతని గొంతులో విన్పించింది.




''తప్పదు'' నా గొంతు స్థిరంగా పలికింది.

ఆశాసౌధాలు కుప్పకూలిన దిగులు ఆ కళ్లల్లో కనబడింది. చేతికందిన స్వర్గం అనుభవంలోకి రాకుండానే చేజారిపోయిన ఫీలింగ్ అతని మొహంలో స్పష్టమైంది.

ఆ దిగులు...బాధ...నిరాశ చూసి మనసులోనే హాయిగా నవ్వుకున్నాను. మొహంలో దిగులు మాత్రం అలాగే ఉంచాను.

అర్హతలేని వాటి కోసం అర్రులు చాస్తూ...అందనివాటి కోసం అతిగా ఆశపడి అవి దక్కకపోతే నిరాశ, నిస్పృహలకు లోనుకావడం..తన కోరిక న్యాయబద్ధమైంది...ధర్మమైంది కాదని తెలిసీ ఆశించి భంగపడడం మనిషి నైజమా?

''మళ్ళీ ఎప్పుడొస్తారు?'' నిరాశ దిగమింగి ఆశగా..ఆరాటంగా అడిగాడు.

''తరచూ వస్తూనే ఉంటాను. పోనీ ఓ పనిచెయ్యండి...మీరే మా వూరు రండి'' సమ్మోహనంగా నవ్వాను.

అతను ఫ్లాటయిపోయాడు. అడ్రస్ చెప్పండి..జేబులోంచి చిన్న నోట్‌బుక్, పెన్ను తీశాడు.

అటుముందుకి నడిచి నాలుగు బిస్కెట్ పాకెట్స్ తీసుకున్నాను. వందరూపాయలు అతనే ఇచ్చాడు. ఇంకా అతనిలో ఆశ చావలేదు మరి.

''అదేవిటి మీరిచ్చారు'' కావాలనే ఆలస్యం చేసి అన్నాను.

''మీ కోసం నేను ఆ మాత్రం ఖర్చు చేయకూడదా ఏంటి?'' మా ఇద్దరి మధ్య ఏదో ఉన్నట్టు అన్నాడు.

నవ్వాను.

''సరే అడ్రస్ రాసుకోండి'' నేనే గుర్తుచేశాను.

''మోహిని..కేరాఫ్ నరసింహం ఎస్సై...''నేను చెబుతూనే ఉన్నాను అతని పెన్ను ముందుకి కదల్లేదు.

రెడీగా ఉన్న చీరాల బస్‌లోకి ఎక్కి కూర్చున్నాను. బస్ దగ్గరికి వస్తాడేమోనని బస్ కదిలేవరకూ ఎదురుచూశాను. నేను ఊహించినట్టే రాలేదు. 'పరాయి ఆడదాన్ని పబ్లిక్ ప్రాపర్టీలా చూసే అతని మగబుద్ధికి చెప్పుదెబ్బలా ఉంది. ఇహ జన్మలో పరాయి ఆడదానితో ఎప్పుడూ ఇలా ప్రవర్తించడు వెధవ'

నా నటనకి నేనే హ్యాట్సాఫ్ చెప్పుకున్నాను. పిరికిదానిగా పేరున్న నాకు ఇంత సమయస్ఫూర్తి, ధైర్యం ఎలా వచ్చాయో నాకే ఆశ్చర్యంగానూ...అద్భుతంగానూ ఉంది.

☆